**కథ**

**'టు లెట్' అన్న బోర్డు చూసి సడన్ బ్రేక్‌తో స్కూటర్ ఆపాను. 'ఈ ఇల్లయినా నాకు నచ్చేలా ఉండేటట్లు చెయ్ స్వామీ' అని మనసులో ఇష్టదైవాన్ని ప్రార్థించుకుంటూ ఇంటి గేటు తీసుకొని లోపలికి అడుగుపెట్టాను.**

దాదాపుగా ముప్పైఐదు సంవత్సరాల వయసున్న స్త్రీ- చుట్టూ పిల్లలను కూర్చోపెట్టుకొని ట్యూషన్లు చెబుతోంది. పిల్లలు గడగడ పెద్దగా బైటికి చదువుతూ పాఠాలను బట్టీపడుతున్నారు.

''ఎక్స్‌క్యూజ్ మీ'' అన్న నా గొంతు విని ఆమె తలెత్తి ఏం కావాలన్నట్లుగా నావైపు చూసింది.

# నేనో సైతీర

''ఇక్కడ టు లెట్ బోర్డు పెట్టారుకదా ఆ ఇల్లు చూపిస్తారా'' కాస్త నమ్రతగానే అడిగాను. ఎందుకంటే.. అద్దె ఇంటికోసమొచ్చే మనుషుల్ని.. వారి మాటతీరును నిశితంగా గమనించి, నచ్చితేనే ఇల్లు అద్దెకిస్తారని, లేకపోతే ''అయ్యో! ఇప్పుడే వేరేవాళ్ళకి ఇచ్చేశామండీ..బోర్డు తియ్యటం మర్చిపోయామంటూ'' మాట మార్చేస్తారన్న శ్రీమతి మాటలు గుర్తుకురావటంతో.

''రండి..చూపిస్తాను'' అంటూ ఆమె పిల్లల మధ్యలోంచి లేచి పక్కపోర్షను తాళం తీసి లోపలికి వెళ్ళి లైట్స్ ఆన్ చేసింది. అప్పటికే చీకటి ముసురుకోవడంతో ఆమె వెనకే లోపలికి అడుగుపెట్టిన నాకు సంతోషంతో పైకెగరాలనిపించింది- స్కూల్లో పర్మిషను పెట్టి రెండుగంటల నుండీ మంచి అద్దెఇల్లు కోసం తిరుగుతున్న నా అన్వేషణ ఫలించడంతో.

టూ బెడ్‌రూమ్స్.. హాల్.. విశాలంగా వున్న దేవుడి గది.. కప్‌బోర్డ్సుతో అందంగా వున్న కిచెన్.. అన్నింటికి మించి వాస్తుకనుగుణంగా ఆ ఇల్లు ఉండటంతో మరోమాట మాట్లాడకుండా.. ఆమె అడిగిన అడ్వాన్స్ ఇచ్చేసి నేను తెచ్చిన తాళం వేసేసుకొని హుషారుగా బైటికి నడిచాను- నా ఊహలకు అనుగుణంగా వున్న ఇల్లు దొరకడంతో.

★ ★ ★

ఆ తర్వాత రెండురోజులకు కొత్తఇంటికి మారిపోయాం. నేనూ, నా భార్య రమణి ఇద్దరు పిల్లలు, సామాన్లతోసహా.

నేను గవర్నమెంట్ స్కూల్లో టీచరుని. వరంగల్ నుండి హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ అవ్వడంతో ముందుగా నేను డ్యూటీలో జాయిన్ అయిపోయి రోజూ హైదరాబాద్‌కి వరంగల్‌కి షటిల్ సర్వీస్ చేస్తూ ఇంటికోసం వారం రోజుల పాటు తీవ్రంగా ప్రయత్నం చేసి చివరకు దొరికించుకున్న తర్వాత కుటుంబాన్ని వరంగల్ నుండి హైదరాబాద్‌కి మార్చేశాను.

సామాన్లు ఓ తీరుగా సర్దుకునేసరికి దాదాపుగా వారంపైనే పట్టింది. ఆరోజు ఆదివారం. శెలవు కావటంతో ఇంట్లో ప్రశాంతంగా కూర్చొని టి.వి.లో డిస్కవరీ ఛానల్ చూస్తున్నాను ఆసక్తిగా.

''పాతబట్టలకు కొత్తస్టీలు సామానులిస్తాం'' అంటూ అరుపు వినబడేసరికి అంతవరకూ వంటింట్లో పనిచేసుకుంటున్న రమణి ఒక్కుదుటున బైటకెళ్ళి ఆ అమ్మాయిని పిలుచుకొచ్చి ఇంట్లోని పాతబట్టలను ఆమె ముందు కుప్పగా పోసింది.

దాదాపుగా గంటసేపు బేరసారాలు నడిచిన తర్వాత ఒక చిన్న పాత్ర ఇవ్వడానికి ఆ స్టీలు సామాన్లావిడ అంగీకరించి ఆ బట్టలన్నీ తీసుకొని ఆ స్టీలు పాత్ర రమణి చేతిలో వుంచి వెళ్ళిపోయింది.

''ఎలావుందండీ ఈ స్టీలు గిన్నె'' అంటూ టీసీలో నుంచి తెల్లుస్తున్న నా దగ్గరకు తీసుకొచ్చి చూపించింది.

''అన్ని బట్టలకు..ఇంత చిన్నగిన్నా?'' ఆశ్చర్యంగా అడిగాను- ఆమె చేతిలోని ఒక లీటరు పాలు మాత్రమే పట్టేటట్టున్న చిన్నగిన్నెను చూస్తూ.

''దీన్ని చేతిలో పట్టుకొని చూడండి. ఎంత బరువుందో!'' అంటూ నా చేతికిచ్చి.. ఇంతలో పక్కపోర్షనులోని ఇంటి ఓనరు ప్రశాంతిగారు రావటంతో ఆమె దగ్గరకు వెళ్ళింది చూపించడానికి, నా చేతిలోది తీసుకుని.

భర్త చనిపోవటంతో అతనికొచ్చిన డబ్బులతో ఈ ఇల్లు రిపేరు చేయించి మాకు అద్దెకిచ్చింది ఇంటి ఓనరు ప్రశాంతిగారు. అనుకోనివిధంగా స్కూటరు యాక్సిడెంట్‌లో భర్త చనిపోయినా ధైర్యాన్ని కోల్పోకుండా తొందరగానే తేరుకుని ప్రవేటు స్కూల్లో అతి తక్కువ జీతంతో మేమిచ్చే అద్దెతో సాయంత్రంపూట చెప్పే ట్యూషన్లు మీద వచ్చే డబ్బుతో పిల్లలను చదివించుకుంటూ ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని గెల్చుకోవటానికి ఆమె చేస్తున్న కష్టం చూపిస్తున్న తెగువ చూసి.. సహజంగానే ఆమె అంటే గౌరవం ఏర్పడింది.

''ఆ సమయానికి మీరుగానీ వుంటే మిమ్మల్ని కూడా పిలిచేదాన్ని. మా ఇంట్లోని పాతబట్టలు వేసి ఈ స్టీలుగిన్నె తీసుకున్నాను. ఎలావుందండీ'' ఆసక్తిగా అడుగుతుంది రమణి.

''చాలాబాగుంది రమణిగారూ!'' అంటూ ప్రశాంతిగారు మెచ్చుకోవటంతో తన ప్రయోజకత్వానికి తనే మురిసిపోయినట్లుంది శ్రీమతి. ఆ తర్వాత ఇక రెచ్చిపోయింది.

''రోజూ మీరు స్కూలుకెళ్ళే సమయంలోనే ఈ స్టీలు సామాన్లమ్మాయి వస్తోంది. సరే! ఒక పని చేయండి. మీ పాతబట్టలన్నీ నాకిచ్చి వెళ్ళండి. నేనే మంచిగా బేరమాడి మీకోసం ఒక మంచి స్టీలు సామాను కొని వుంచుతాను'' తన ఉదారతను ప్రకటించింది రమణి.

''వద్దులెండి నాకంతగా ఇష్టంలేదు'' అంటూ ఆ టాపిక్ అక్కడితో ఆపేసి ''నేను షాపు వరకూ వెళ్తొస్తాను. ట్యూషను పిల్లలొస్తే ఇంటితాళం ఇవ్వండి. లోపలి కూర్చొని చదువుకొమ్మని చెప్పండి'' అంటూ ఇంటితాళం మా రమణికిచ్చి ఆమె బైటకెళ్ళిపోవడం నాకు తెలుస్తూనే వుంది.

.వందకిలోమీటర్ల స్పీడుతో పోతున్న నా శ్రీమతికి ఒక్కసారిగా బ్రేక్ వేసినట్లైంది. ప్రశాంతిగారు ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోయేసరికి ఇక సరాసరి విసవిసా నాదగ్గరకు వచ్చింది.

''ఏమిటండీ ఈ టీచరుగారు! నేను కోరి కోరి సాయం చేస్తానంటే వద్దంటారేమిటండీ!'' అంటూ అప్పటివరకూ జరిగినదంతా మరింత విపులంగా నాకు తెల్సిన విషయమే మరోసారి చెప్పింది.

''పోనీలే రమా.. ఆమె వద్దన్నప్పుడు నువ్వెందుకు బాధపడ్తావు'' అంటూ ఊరడింపుగా మాట్లాడేసరికి కాస్త తేరుకుని వంటింట్లోకి నడిచింది రమణి.

★ ★ ★

ఆరోజు మా పెద్దబాబు మనీష్ పుట్టినరోజవ్వటంతో రమణి పెద్ద హడావిడి చేసేసింది. ఇల్లంతా చక్కగా డెకరేటివ్ పేపర్స్‌తో రంగురంగుల బెలూన్స్‌తో అలకరించేసింది. నాచేత బేకరీ నుండి కేకును తెప్పించింది. చుట్టుపక్కల వున్న రమణి ఫ్రెండ్స్‌ని, మనీష్ వాళ్ళ ఫ్రెండ్స్ పేరెంట్స్‌ని,

ఉన్నోడి ఫ్రెండ్స్‌ని, వాళ్ళ అమ్మానాన్నలను డిన్నర్‌కి పిల్చింది.

''రమణా! చిన్నపిల్లోడి పుట్టినరోజుకి ఇంత ఖర్చు చేసే బదులు ఈ డబ్బుని ఏదైనా పోస్టల్ సేవింగ్స్‌లో వేస్తే బాగుంటుంది కదా!'' అంటూ ఇంకా నేను చెప్పబోతుండగానే ఒక్కసారిగా గయ్యిన నామీద విరుచుకుపడిపోయింది రమణి.

''మీరిలా ప్రతీ పనిని డబ్బుతో ముడిపెడితే మనం ఏమీ అనుభవించలేమండీ. సినిమాకు వెళ్దామంటే డబ్బులు వేస్ట్ అంటారు. శలవుల్లో ఏదైనా టూర్ వెళ్ళి చక్కగా తిరిగొద్దామంటే అప్పుచేసి వెళితే ఆ అప్పు మళ్ళీ ఎలా తీర్చుతాం అంటూ ముందుకాళ్ళకి బంధం వేస్తారు. ఈరోజు మాత్రం మన మనీష్ పుట్టినరోజు ఘనంగా జరపవల్సిందే. అసలే ఇది వాడికి ఏడో పుట్టినరోజు. చుట్టుపక్కల అందరూ చెప్పుకునేలా గొప్పగా చెయ్యాలి మనం. దీనికి మాత్రం మీరు అడ్డుచెప్పవద్దు' అంటూ వాయించెయ్యడంతో ఇక చేసేదేమీలేక కావాల్సినవి తేవడానికి రమణి ఇచ్చిన లిస్ట్ తీసుకొని బజారుకి బయల్దేరాను.

నేను మార్కెట్ పనులు ముగించుకొని వచ్చేసరికి ప్రశాంతి టీచర్ ఆరోజు ట్యూషను తొందరగా ముగించేసినట్లుంది- వంటల్లో రమణికి సహాయం చేస్తుంది. ఇంటి ఓనరు అనే భేషజం ఏమాత్రం లేకుండా, ఆమె పిల్లలిద్దరూ రంగు పేపర్లతో చిన్నపిల్లలకు 'బఫూన్ టోపీలు' తయారుచేస్తున్నారు. మొత్తానికి ప్రశాంతి టీచరు ఇంట్లోనివారందరూ ఆరోజు పార్టీలో తలలో నాలుకలా వ్యవహరించారు- అన్ని పనుల్లో సహాయం చేస్తూ. ఆమెకే మైనా సహాయం కావలిసొస్తే మాత్రం ఏమీ వెనకాడకుండా చేసెయ్యాలని అప్పుడే నిర్ణయించుకున్నాను.

పార్టీకి పిల్చినవారందరూ వచ్చేసరికి లేటవ్వడంతో కేక్ కట్ చేసి అందరికీ పంచి . పిల్లలందరికీ బఫూన్ టోపీలు పెట్టి, ఫోటోలు తియ్యడం లాంటి కార్యక్రమాలు పూర్తయ్యేసరికి తొమ్మిది దాటింది.


ఇక అప్పుడు డిన్నర్ మొదలుపెట్టాం. అసలే డిసెంబరు నెల కావడంతో చలి బాగానే వుంది. పిల్లలు నిద్రమత్తుతో జోగుతూ ఏదో కాస్త కెలికి మిగతా ఐటమ్స్ వదిలేస్తే ఇకప్పుడు పెద్దలు కూడా కాస్త కాస్త తిని వదిలెయ్యడంతో చాలా పదార్థాలు వేస్ట్ అయ్యాయి. పార్టీ అయిన తర్వాత లెక్కలు చూస్తే గుండె గుభేలుమందీ- అయిన ఖర్చుని చూసుకొని.

అయినాసరే అందరూ తృప్తిగా తినుంటే నేను చాలా హేపీగా ఫీల్ అయ్యేవాడ్ని. అటు ఖర్చూ తప్పలేదు. అలాగని దానికి తగ్గ ఫలితమూ దొరకలేదు. నాకు అసంతృప్తిగానే గడిచిందా రాత్రి. రమణి మాత్రం తననుకున్నది నెరవేరడంతో హాయిగా నిద్రపోయింది.

★ ★ ★

ఆరోజు ఆదివారం. స్కూలుకి హాలిడే కావడంతో అంతకుముందు జరిగిపోయిన ఇండియా-ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ హైలెట్స్ చూపిస్తూంటే ఆసక్తిగా చూస్తున్నాను.

''హేమంత్‌గారు'' అని పిలుస్తూ ప్రశాంతి టీచరు వచ్చేసరికి టి.వి. సౌండ్ తగ్గించి ''చెప్పండి'' అంటూ మర్యాదగా లేచి కూర్చోడానికి ఎదురుగా వున్న కుర్చీ చూపించాను. వంటింట్లో



నుండి రమణి కూడా వచ్చి నా పక్కనే కూర్చుంది.

''వచ్చే ఆదివారం మా కిరణ్ బర్త్‌డే. ఈ ఇంటికి దూరంగా ప్రశాంత వాతావరణంలో వాడి పుట్టినరోజు జరపాలనుకుంటున్నాను. మీరు కొంచెం సహాయం చెయ్యాల్సి వుంటుంది' అంటూ ఇంకా ఏదో చెప్పబోయి సందేహంతో ఆగిపోయింది.

''నేను చెప్తాను టీచర్.. మీకసలే మొహమాటం'' అంటూ రమణి నా వైపుతిరిగి-

''ఏమీ లేదండీ మీకు కారు డ్రైవింగ్ వచ్చుకదా! టీచర్ ఫ్రెండ్ వాళ్ళకి కారు ఉందట. మీరు ఆరోజు డ్రైవింగ్ చేస్తానంటే అడిగి తీసుకొస్తానంటున్నారు'' వివరంగా చెప్పింది.

''సరే! అలాగే సహాయం చేస్తాను టీచర్. మీ ఏర్పాట్లు మీరు చేసుకోండి'' చెప్పాను మనస్ఫూర్తిగా.

మా దంపతులకు కృతజ్ఞతలు తెలియచేసి.. ట్యూషను పిల్లలు రావటంతో ప్రశాంతి టీచరు వెళ్ళిపోయారు.

★ ★ ★

ముందుగా అనుకున్నట్లుగానే ప్రశాంతి టీచర్ వాళ్ళ ఫ్రెండ్ కారు తీసుకొని ఆమె చెప్పిన గుర్తుల ఆధారంగా ఒక ఆశ్రమానికి చేరుకున్నాం-రెండు

పల్లి ఉమాప్రసాద్

కుటుంబాలు కల్సి).

కారు డిక్కీలో లగేజీ పెడుతున్నప్పుడు నేను చూడలేదుగానీ ప్రశాంతి టీచరు 'లగేజి తియ్యాలి. కాస్త డిక్కీ తెరవండి'' అనేసరికి డిక్కీ తెరచి లోపలికి చూసి ఒక్కసారిగా అదిరిపడ్డాను. లోపల చాలా లగేజి వుంది. అంత లగేజి ఆమెతో మోయించడం ఇష్టంలేక ఆమెను వెళ్ళిపొమ్మని చెప్పి నేను మొత్తం లగేజి లోపలికి చేరవేశాను.

మూడు పెద్ద బ్యాగులు మాత్రం పూర్తిగా నిండిపోయి చాలా బరువుగా వున్నాయి. మిగతావి అక్కడ మధ్యాహ్న భోజనం కోసం వండిన పదార్థాలు పెద్ద పెద్ద స్టీలు క్యానులలో సర్దివున్నాయి. నల్గురు పెద్ద పిల్లలు, ఇద్దరాడవాళ్ళు, నేను- ఈ కొద్దిమందికి ఇంతమొత్తంలో ఐటమ్స్ అవసరమా! అని ఆశ్చర్యపడుత్తూ ఆశ్రమం లోపలికి అడుగుపెట్టాను.

ఆ ఆశ్రమంలో పెరుగుతున్న పిల్లలనుకుంటా! దాదాపు ఇరవైమంది వరకూ ప్రశాంతి టీచరు చుట్టూ మూగిపోయారు.

వాళ్ళందరినీ పేరుపేరునా ఆప్యాయంగా ఆమె పలకరిస్తున్న తీరును చూస్తే ఆమె అక్కడికి అంత కుముందు ఒకటి రెండుసార్లు వచ్చుండవచ్చనుకున్నాను.

ఆ ఆశ్రమ నిర్వాహకులతో ఆమె కొద్దిసేపు ఒంటరిగా మాట్లాడిన తర్వాత ఆ ఆశ్రమంలోని పిల్లలందరి సమక్షంలో బర్త్‌డే కేకును కిరణ్ చేత కట్‌చేయించి. మాకు అక్కడున్న పిల్లలకూ పంచి పెట్టింది.

వాళ్ళందరూ ''హేపీ బర్త్ డే కిరణ్'' అంటూ రాగయుక్తంగా పాడుతూ ఆనందంగా కేక్, ఆ తర్వాత స్వీట్ తింటున్న ఆ పిల్లలను చూస్తూంటే నాలో ఏదో తెలియని తృప్తి కలగసాగింది.

ఇంతలో ఆశ్రమ నిర్వాహక స్వామీజీ రావటంతో అందరం ఒక్కసారిగా లేచి నిలబడ్డాం గౌరవ సూచకంగా.

''ఏమ్మా ప్రశాంతి! ఏమిటి విశేషం'' ఆప్యాయంగా నవ్వుతూ పలకరించారు స్వామీజీ.

''ఈరోజు మా కిరణ్ పుట్టినరోజు స్వామీ.. పిల్లలకు స్వీట్స్, నా స్నేహితుల దగ్గర సేకరించిన బట్టలను ఇద్దామని వచ్చాను స్వామీ'' అంటూ వినయంగా పలికి అందరినీ పేరుపేరునా స్వామీజీకి పరిచయం చేశారు ప్రశాంతిగారు.

స్వామీజీ మమ్మల్లను ప్రేమగా ఆశీర్వదించారు.

''నీలాంటి వాళ్ళుండబట్టే ఆ పసి వాళ్ళు తల్లికి తండ్రికి దూరమైనా మంచి బట్టలు కట్టుకొని, చక్కని విద్యాబుద్ధులు నేర్చుకుంటున్నారు. తద్వారా సమాజానికి ఉపయోగపడే మంచి పౌరులుగానూ తయారవుతున్నారు. నువ్వు సమాజానికి ఉపయోగపడే మంచి పని చేస్తున్నావమ్మా'' అంటూ-

''మీ స్నేహితులకు మన ఆశ్రమమంతా చూపించు'' అని చెప్పి స్వామీజీకి ప్రార్థనా సమయం అవ్వడంతో అక్కడనుండి పూజాగృహానికి వెళ్ళిపోయారు.

నేనూహించిన దానికన్నా ఆమెకు ఆశ్రమంతో అనుబంధం ఎక్కువే ఉన్నట్లుంది.

ఆశ్రమంలోని ప్రతీ అణువూ ఆమెకు చిరపరిచితమేననుకుంటా! ఓపిగ్గా అంతా తిప్పి చూపించింది.

ఆ ఆశ్రమంలో అలా కొంతసేపు తిరుగాడిన తర్వాత మనసంతా ప్రశాంతత ఆవరించింది. రోజూ వెన్నంటివుండే టెన్షన్ ఆ పూట ఎక్కడికో ఎగిరిపోయినట్లనిపించింది.

ఆ తర్వాత ఆశ్రమంలోని పిల్లలకు బట్టలు పంచిపెట్టారు ప్రశాంతి టీచరు. వాళ్ళందరూ ఎంతో ఉత్సాహంగా అందుకున్నారా దుస్తులను.

కొన్నిరోజులు వాడేసిన బట్టలు చిన్నస్టీలు గిన్నె కోసం ధారపోయటం కన్నా ఈ అనాథ బాలలకిస్తే ఎంతో మేలు చేసినవాళ్ళవుతాం అని ప్రశాంతి టీచర్ ద్వారా మాకు తెలియటంతో రమణీ, నేనూ ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం. ఇలాంటి మంచి ఉద్దేశ్యం మా మనసుల్లోకి రాలేదు కదా! అని విచారపడుత్తూ.

తర్వాత స్టీలు క్యానులలో సర్దితీసుకొచ్చిన పదార్థాలు, పులిహోర, గులాబ్ జామూన్, నాల్గురకాల కూరలను స్టీలు క్యానులలో నుండి తీసి, పిల్లలందరికీ కొసరి కొసరి వడ్డించారు ప్రశాంతి టీచరు- రమణి పక్కన సహాయం చేస్తూండగా.

ఒక్క పదార్థం కూడా విస్తరిలో వదిలెయ్యకుండా తృప్తిగా తిన్నారు పిల్లలందరూ.

మనీష్ పుట్టినరోజునాడు వేస్ట్ అయిన పదార్థాలను తల్చుకుంటే..

ప్రశాంతి టీచర్ చేసిన పని ఎంత మంచిపనో మాకు అర్థమైంది.

ఆకలి వున్నవాళ్ళకి భోజనం పెట్టడం ద్వారా మన మనసు ఎంత ఆనందపడుతుందో మొదటిసారి నాకు ప్రత్యక్షంగా తెలిసింది.

మా మనీష్ పుట్టినరోజునాడు మేం పెట్టిన ఖర్చు ఇక్కడ ఆశ్రమానికి ఇచ్చివుంటే ఈ అనాథ పిల్లలకు ఒక సంవత్సరానికి సరిపడా బియ్యమైనా వచ్చి ఉండేవి.

అనవసరంగా చుట్టుపక్కలవారిలో గొప్పగా ఉండాలని తాపత్రయంతో విలువైన డబ్బుని.. ఏమాత్రం సమాజానికి ఉపయోగపడని రీతిలో వేస్ట్‌గా ఖర్చు చేస్తున్నామనిపించింది నాకు.

ఇకనుంచైనా ప్రశాంతి టీచర్‌లాగా- సమాజానికి మనకు చేతనైనంతలో ఉపయోగపడాలని మనసులో దృఢంగా నిశ్చయించుకున్నాను, ఆ క్షణమే.

## అన్షు ఆశ

**అందాలభామ అన్షు ఎప్పుడూ కొత్తదనానికే ప్రాధాన్యం ఇస్తుంది. ఇంగ్లాండ్‌లో పుట్టి పెరిగినా భారతీయ సంప్రదాయం అన్నా, సినిమాలన్నా ఆమెకెంతో ప్రాణంట. తండ్రి కూడా షూటింగ్స్‌కి వచ్చే అన్షు ఇప్పుడు ఇండియా వదలి వెళ్లడానికి ఇష్టపడటం లేదు. తెలుగు సినిమాల్లో నటించడం తనకెంతో ఇష్టం అని చెప్పే ఈ తారకి ఆంధ్రాభోజనం అంటే ఎంతో మక్కువట. హైదరాబాద్‌కి వచ్చి కొన్నాళ్ళే అయినా ఇప్పుడామెకి ఎంతోమంది బంధుమిత్రులు ఏర్పడ్డారు. ఖాళీ సమయాల్లో వారితో గడపడానికి ఎక్కువ సమయం కేటాయిస్తోంది. తెలుగులో మరిన్ని అవకాశాలు వస్తాయని ఆమె ఆశపడుతోంది.**

